మినీకథ

# లైసెన్స్ లేకపోతే...



— ఎస్. వేణుగోపాల్

భారతదేశ కాలమాన ప్రకారం అప్పుడు సమయం సరిగ్గా ఐదు గంటలా, ఐదు నిముషాలా, ఐదు సెకండ్లు.

తెలుగుతల్లి విగ్రహం ముందున్న ఖాళీ ప్రదేశమంతా ఒక్కసారిగా జాతర జరిగే ప్రదేశంలా మారిపోయింది.

సచివాలయం నుండి బయటికొచ్చిన ప్రతిఒక్కరి ఆలోచన దాదాపు ఒక్కటే! 'ఎలా ముందుగా బస్సెక్కాలి? ఎలా ముందుగా ఇంటికి చేరిపోవాలి?'

ఈ విషయంలో నేను కూడా అంతే మరి! నేను ఎక్కాల్సిన బస్సు వనస్థలిపురం వైపు వెళ్ళేది.

నా ఆలోచనలను పసిగట్టినట్లే వచ్చి నిలబడింది వనస్థలిపురం బస్సు. క్యూలో కాస్త ముందువైపుగానే వుండడంతో బస్సులో సీటు సులభంగానే దొరికింది. 'అమ్మయ్య! త్వరగానే ఇల్లు చేరవచ్చు' అనుకున్నాను మనస్సులో.

పిల్లల కోడి లా అందర్నీ సావకాశంగా లోపలికి తీసుకుని, మెల్లగా గమ్యం వైపు ప్రయాణం సాగించింది బస్సు.

నా పక్కన కూర్చున్న వ్యక్తి వున్నట్లుండి అడిగాడు "ఏమోయ్ మూర్తి, ఎక్కడి వరకు?"

దానికి ముందు సీట్లో కూర్చున్న వ్యక్తి ఇలా అన్నాడు "అబిడ్స్‌లో దిగాలి గురు, కొంచెం పనుంది."

గురు చిన్నగా నవ్వి అన్నాడు "కాయ్!"

"అదేంటి గురు?"

"నాకు చెప్పకోయ్! బ్రహ్మచారివి, అబిడ్స్‌లో ఎందుకు దిగుతావో నాకు చెప్పాలా?"

"అబ్బే! అదేం లేదు గురు. నిజంగానే నాకు కొంచెం పనుంది." నీరసంగానే జవాబిచ్చాడు మూర్తి అనబడే వ్యక్తి.

గురు ఈసారి ముందు సీట్లో కూర్చున్న రెండో వ్యక్తి భుజం మీద చెయ్యి వేశాడు "చూడవోయ్ రావ్, మనకే అబద్దం చెబుతున్నాడు మూర్తి."

"పోలేవోయ్! ఏదో, అదో సరదా!"

సర్దేశాడు రావ్ అనబడే వ్యక్తి.

అబిడ్స్ వచ్చేసింది.

"ఓ.కే.! గుడ్‌నైట్ గురు" మెల్లగా బస్సు దిగిపోయాడు మూర్తి.

బస్సు అబిడ్స్ దాటి బ్యాంక్ స్ట్రీట్ చేరింది.

"ఏమోయ్ రావ్, ఇంటికేనా?"

"అవున్రా రమణ."

"అప్పడే!"

"అవున్రా, మా ఆవిడ ఎదురు చూస్తుంటుంది. నిన్న కూడా ఆఫీసులో చాలా ఆలస్యమైపోయింది."

"సర్లేవోయ్! మా ఆవిడ ఎదురు చూడదేమో! కోఠీలో కాస్సేపు సరదాగా గడిపేసిపోదాం పద! పిట్టలవేట అవుతుంది. టైమ్ కూడా ఈజీగా గడిచిపోతుంది."

అప్పటివరకు ఇంటి ధ్యాసలో వున్న నాకు లైసెన్స్ బిళ్ళ వున్న రమణ మాటలు విన్న తరువాత త్వరగా ఇల్లు చేరాలో, లేక కోఠీలో దిగాలో అర్ధం కాలేదు. ◆

---

**డాలర్‌జాలం**

డాలరునన్ను మంత్రిస్తుంది
ఎక్కడైనా ఒక్కటే పేప[illegible]రెక్కల కష్టానికి
ఒక్క డాలరుకి ముప్పై ఐదు రూపాయల లెక్క
ఎంతకీ సాధింపబడని నా జీవిత రెక్కలకి
ఒక శాశ్వత పరిష్కారంలా సాక్షాత్కరిస్తుంది
అమెరికన్ గ్రీన్‌కార్డులా అభయమిస్తుంది
పెరిగే ద్రవ్యోల్బణం సూచీతో పోటీగా పెరగలేక
మొదలైన దగ్గిరే పడివున్న జీతంరాళ్ళ గొంగళి
తీయటికలనుండి తీరని ఆశగా
మారిపోయే సొంత యింటి కోరిక
బజారుగా మారిన దేశం పుట్టలోంచి
బుసలు కొట్టే వస్తు ప్రపంచపు సర్పాలు
కోర్కెలనావకూ, ఉద్యోగతీరానికీ నడుమ లంగరందక
కుదించబడిన రూపాయినోటయ్యే మనసు
డాలరు నన్ను వెంటాడుతుంది
ఇంత ఉద్యోగం చేసీ నెలాఖరు రోజుల్లో
ఈదేబిరింత లెందుకని ప్రశ్నిస్తుంది
అసలీ దేశమే ముక్కలు ముక్కలుగా
ప్రపంచ బ్యాంకు ముందుతాకట్టుపడుతున్నాక
ఇంకా ఈ ఊగిసలేంటని వెక్కిరిస్తుంది
అగ్రదేశ కంప్యూటర్ పరిశ్రమకు
మూడో ప్రపంచదేశాల మెదళ్ళ వలస
ఇపుడు చదువుపట్టాలయినా
అవి కంప్యూటర్ పాఠాలని మోయాల్సిందే
ఇక ఈ రూపాయలన్నీ డాలర్స్మరించాల్సిందే
డాలరు నన్ను లోబరుచుకుంటుంది
ఇక పుట్టిన నేలా.. పీల్చిన గాలీ...
పెంచుకున్న మానవ సంబంధాలూ..
'పనికిరాని'సెంటిమెంట్లకిక సెలవు!



డాలరు నాకు వీసారెక్కలు తగిలించి
ఈదేశంనుంచీ మాయం చేస్తుంది.

— కోడూరి విజయకుమార్